

98,991 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

● డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పాలకొండ: జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 98,991 మందికి పోలియో చుక్కలు వేయనున్నట్లు డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు తెలిపారు. గురువారం అన్నవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. పోలియో వ్యాక్సిన్, కేరియర్లు, కోల్డ్ చైన్ సిస్టమ్‌ను తనిఖీ చేశారు. ఈనెల 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నామని, ఇందుకోసం జిల్లాలో 42 మొబైల్ టీమ్‌లు, 19 ట్రాన్సిట్ టీమ్‌లు, 905 బూత్‌లు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి సరిపడా వ్యాక్సిన్, ప్రచార సామగ్రి పంపిణీ చేశామని తెలిపారు.

దాహం.. దాహం..

● జిల్లాకేంద్రంలో మూడు, నాలుగు రోజులకొకసారే తాగునీటి సరఫరా ● బిందెడు నీటి కోసం పరుగులు
● వేసవి ఇంకా పూర్తిగా రాకముందే పట్టణవాసులకు తప్పని అవస్థలు ● కానరాని ముందస్తు ప్రణాళికలు
● సమగ్ర రక్షిత పథకం కాగితాలకే పరిమితం ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



బెలగాం: కొళాయిల నుంచి అరకొరగా వస్తున్న నీటిని పడుతున్న మహిళలు

(పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 29)

వేసవి ఇంకా పూర్తిగా రాకముందే జిల్లా కేంద్రం పార్వతీపురం మున్సిపాల్టీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. పట్టణంలో 30 వార్డులకు కొన్ని నెలలుగా మూడు, నాలుగు రోజులకొకసారి మాత్రమే తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిందెడు నీటి కోసం పరుగులు పెడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఇక ముందు వేసవిలో తమ పరిస్థితేమిటోనని జిల్లాకేంద్రవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గత టీడీపీ ప్రభుత్వ హయాం లో అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రజల తాగునీటి కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. మొత్తంగా వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రణాళికలు కాగితాలకే పరిమితం కావడంతో పట్టణవాసులు దాహార్తితో అలమటిస్తున్నారు.



బెలగాం: ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న పట్టణ మహిళలు (ఫైల్)

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మున్సిపాల్టీ 1959లో ఏర్పడగా.. నాటి నుంచి గరుగుబిల్లి మండలం తోటపలి వద్ద నాగావళి నది నుంచి జిల్లా కేంద్రానికి తాగునీటి సరఫరా చేస్తున్నారు. అప్పటి పట్టణ జనాభా 10 వేల నుంచి 15 వేల మంది ఉండేవారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత ప్రస్తుత పట్టణ జనాభా 2012 అధికార లెక్కల ప్రకారం 55 వేల 550 మంది అయితే అనధి కారికంగా చూస్తే.. 75 వేల నుంచి 80 వేల మంది వరకు ఉంటారనేది కాదనలేని వాస్తవం. ఇకపోతే జిల్లా కేంద్రం శివారుల్లో పుట్టగొడుగుల్లా కాలనీలు ఏర్పడుతుండగా.. తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందిం చేందుకు గత టీడీపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినా ఫలితం లేకుండా పోయింది.

సాగని సమగ్ర తాగునీటి పథకం పనులు

గత టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ తాగునీటి పథకానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించింది. అయితే ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో అది కార్యరూపం దాల్చలేదు. 2019లో వైసీపీ పాలనా పగ్గాలు చేపట్టినప్పటికీ దానిపై దృష్టి సారించలేదు. కాగా రెండేళ్ల కిందట ఎంతో అట్టహాసంగా రూ.63.63 కోట్లతో సమగ్ర తాగునీటి పథకానికి శిలాఫలకాన్ని మాత్రం ఆవిష్కరించారు. పనుల్లో మాత్రం ఎటువంటి కదలిక లేదు. తోటపల్లి ప్రధాన పంప్‌హౌస్ నుంచి పట్టణానికి తాగునీటి సరఫరా చేసే పైపులు గత రెండేళ్లుగా గరుగుబిల్లి మండల ఉల్లిభద్ర సమీపంలోనే వృథాగా పడి ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా సమగ్ర తాగునీటి పథకం కాగితాలకే పరిమితమైందని చెప్పొచ్చు. మరోవైపు పట్టణంలో తాగునీటి సరఫరా అధ్వానంగా ఉందని ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిసినప్పటికీ శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు.



నాగావళి నదిలోని రెండో ఇన్‌ఫిల్టర్ బావికి నీటిని తరలిస్తున్న దృశ్యం

నీటిని మళ్లించడంలో అలసత్వం..

మున్సిపాల్టీ ఏర్పడిన తొలినాళ్లలో నాగావళి నది నుంచి పట్టణానికి తాగునీటి సరఫరా చేయడం ఇంజనీరింగ్ అధికారులకు చాలా సులభంగా ఉండేది. అప్పట్లో నాగావళి నదికి 20 నుంచి 30 మీటర్ల పరిధిలో రెండు ఇన్‌ఫిల్టర్ బావులను ఇ నిర్మించారు. 1990 దశకంలో పట్టణ జనాభా పెరుగుతుండడంతో నదికి మరో 30 నుంచి 40 అడుగుల దూరంలో మరో రెండు ఇన్‌ఫిల్టర్ బావులను నిర్మించారు. అయితే వాటి నిర్మాణంలో అధికారులు చేసిన చిన్న చిన్న తప్పిదాలే.. నేడు పట్టణ ప్రజల తాగునీటి కష్టాలకు కారణమవుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కూడా నాగావళి నది నీటిని ఇన్‌ఫిల్టర్ బావులకు మళ్లించడంలో వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించకపోవడం విచారకరం. నదిలో ఉన్న మొదటి ఇన్‌ఫిల్టర్ బావిలో 17.5 హెచ్‌పీ మోటారు, రెండో ఇన్‌ఫిల్టర్ బావిలో 7.5 హెచ్‌పీ మెటారుతోనే ప్రధాన పంప్ హౌస్ నుంచి బూస్టర్ పంప్ హౌస్‌కు.. అక్కడ నుంచి పట్టణంలోని ఐదు రక్షిత పథకాలకు నీటిని మళ్లిస్తున్నారు. వాటి ద్వారానే 30 వార్డులకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. కాగా నదిలో ఉన్న మూడో ఇన్‌ఫిల్టర్ బావిలో 10 హెచ్‌పీ 2 మోటార్లు, నాలుగో ఇన్‌ఫిల్టర్ బావిలో 5 హెచ్‌పీ మెటారు ఏర్పాటు చేసినా ప్రధాన పంప్‌హౌస్‌కు అరకొరగా నీటి సరఫరా జరుగుతుందనే చెప్పాలి. ఇప్పటికీ ఎలాంటి మార్పు రాలేదనే చెప్పొచ్చు. వేసవిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దే శంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రధాన పంప్‌హౌస్ వద్ద సుమారు రూ. 40 లక్షలు విలువ చేసే జనరేటర్‌ను కొనుగోలు చేసింది. అయితే ప్రస్తుతం దాని నిర్వహణ బాధ్యతలు చూసే వారు లేకపోవడంతో అది మూలకు చేరింది.

జనాభా పెరుగుతున్నా ప్రణాళికలు ఏవీ..?

జిల్లాకేంద్రం.. పార్వతీపురం మున్సిపాల్టీలో రోజురోజుకూ జనాభా పెరుగుతున్నా.. ఇందుకు తగ్గట్టుగా తాగునీటి సరఫరాకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించడం లేదు. జిల్లా కేంద్రం ఏర్పడి మూడేళ్లవుతున్నా.. ఇప్పటికీ తోటపల్లి నాగావళి నది నుంచి పట్టణానికి నీటిని మళ్లించడానికి రెండు 75 హెచ్‌పీ మోటార్లనే వాడుతున్నారు. బూస్టర్ పంప్‌హౌస్ వద్ద ఒకే ఒక్క 100 హెచ్‌పీ మోటారును వినియోగిస్తూ.. పట్టణంలోని 5 రక్షిత పథకాల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత జనాభా సుమారు 80 వేలకు పైగానే ఉండగా.. రోజుకు 5 లక్షల లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. కానీ బెలగాంలోని రెండు, జగన్నాథపురం, కొత్తవలస, మున్సిపల్ కార్యాలయంలోని రక్షిత పథకాల నుంచి రోజుకు 5 లక్షల లీటర్ల కంటే తక్కువగానే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో పట్టణవాసులకు నాలుగైదు రోజులకు ఒకసారి మాత్రమే నీరు అందుతోంది. వాటర్ ట్యాంకర్లు రోజు తప్పించి రోజు వస్తున్నప్పటికీ.. జిల్లాకేంద్రవాసుల దాహార్తి తీరడం లేదు



మరమ్మతుకు గురైన జనరేటర్

ఎన్నాళ్లీ కష్టాలు

ఎన్నాళ్లీలా తాగునీటి కోసం ఇబ్బందులు పడాలో తెలియడం లేదు. కొన్ని నెలలుగా తాగునీటి సరఫరా మరీ అధ్వానంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు మా కష్టాలను అర్థం చేసుకోవాలి. లేదంటే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుంది.

- రవణమ్మ, శివారు కాలనీ, పార్వతీపురం

ఎదురుచూడాల్సి వస్తోంది..

మా కాలనీలో మూడు, నాలుగురోజులకొకసారి మాత్రమే కొళాయిల ద్వారా తాగునీరు వస్తుంది. రోజూ వాటర్ ట్యాంకర్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఇప్పుడే తాగునీటి కోసం ఇన్ని ఇబ్బందులు పడుతుంటే.. మందు వేసవిలో పరిస్థితి ఏలా ఉంటుందో అర్థం కావడం లేదు. ఊహించుకుంటేనే భయమేస్తుంది.

- భవానీ, పట్టణ శివారు కాలనీ

పరిష్కారానికి చర్యలు

పార్వతీపురంలో ఈ వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. నాగావళి నదిలోని నీటిని ఇన్‌ఫిల్టర్ బావులకు తరలించే విధంగా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశాం. త్వరలోనే సమగ్ర తాగునీటి సరఫరా పథకం పనులు ప్రారంభిస్తాం.

- కిరణ్, ఇన్‌చార్జ్ కమిషనర్, పార్వతీపురం మున్సిపాల్టీ

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

● కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల దీక్ష

బెలగాం, ఫిబ్రవరి 29: సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సమర్థవంతంగా నిర్వహించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినదిరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులపై సీఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డును గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో ఉన్న రూ.2 వేల కోట్లు వేరే అవసరాల కోసం ప్రభుత్వం దారి మళ్లించి, కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడిచిందని ఆరోపించారు. కరోనా సమయం నుంచి కార్మికులను ఆదుకోవడంలో, పనులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. జీవో నెంబర్ 12, 13ను ప్రకటించి పని లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. కేరళ, తమిళనాడు తదితర ఇతర రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, ఏపీలో మాత్రం అమలు చేయకపోవడం దారుణమని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు నష్టం చేసే జీవోలు రద్దు చేయాలని, ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను తిరిగి జమ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు జి.వెంకటరమణ, సూరిబాబు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేపట్టిన భవన నిర్మాణ కార్మికులు

మరువలేని సంవత్సరం

● నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ప్రత్యేకమైన రోజు శిశువుల జననం
● లీప్ సంవత్సరంలో పుట్టడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో ఆనందం

బెలగాం/సాలూరు,ఫిబ్రవరి 29: నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీప్ సంవత్సరానికి ఉన్న ప్రత్యేకతే వేరు. ఏటా ఫిబ్రవరి నెల 28 రోజులు ఉండగా, ఈ ఏడాది మాత్రం 29 రోజులు ఉన్నాయి. అంటే ఇది లీప్ సంవత్సరం. కాగా లీప్ సంవత్సరంలో పుట్టిన వారు చాలా అరుదు. ఇటువంటి వారు తమ పుట్టిన రోజుని జరుపుకోవాలంటే నాలుగేళ్లు ఆగాల్సిందే. నాలుగేళ్లకు ఒకసారి పుట్టిన రోజు అనేది పక్కన పెడితే, ఇటువంటి ప్రత్యేకమైన రోజున పిల్లలు పుట్టడంపై వారి తల్లిదండ్రులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విషయానికొస్తే గురువారం.. పార్వతీపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పార్వతీపురం మండలం తాళ్లబురిడికి చెందిన పువ్వల సుశీల ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తొలికాన్పు, అందులోనూ నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ఫిబ్రవరి 29న ఆడపిల్ల పుట్టడంతో తండ్రి వెంకటరమణ, కుటుంబ సభ్యులు సంబరపడ్డారు. లీప్ సంవత్సరంలో ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని, తమకెంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. కాగా ఆసుపత్రిలో ఈ రోజు మొత్తంగా ఐదుగురు పిల్లలు పుట్టారని, ఇందులో నాలుగు సాధారణ ప్రసవాలు, ఒక సిజేరియన్ అయినట్లు సూపరింటెండెంట్ వాగ్దేవి తెలిపారు. ఇక మక్కువ మండలం ఆర్.వెంకం పేటకు చెందిన పూజారి భవాని సాలూరులోని ఉన్న ఏరియా ఆసుపత్రిలో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. మొదటి కాన్పు సుఖప్రసవమవగా, ఎంతో ప్రత్యేకమైన రోజు ఆడపిల్ల పుట్టడంతో తండ్రి రాజుతో పాటు బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా లీప్ సంవత్సరం రోజున పిల్లలు పుట్టడంతో ఆయా ఆసుపత్రుల్లో పండగ వాతావరణం నెలకొంది.



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో బిడ్డతో తల్లి సుశీల



సాలూరు ఆసుపత్రిలో బిడ్డతో తల్లి భవాని

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

● 32 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



భామిని: పరీక్ష గదిలో ల్యాబ్ సామగ్రి ఉన్న దృశ్యం

పార్వతీపురం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు ఇవి జరగనుండగా.. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తంగా 32 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 5,756 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 5,700 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. సప్లిమెంటరీ విభాగంలో 1744 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇదిలా ఉండగా కేంద్రాలకు చీఫ్ సూపరింటెం డెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, రెండు సిట్టింగ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలని సూచించారు.

● **బెలగాం/జియ్యమ్మవలస/సాలూరు:** పార్వతీపురంతో పాటు సాలూరు, పాలకొండ, కురుపాం, జియ్యమ్మ వలసలోని చినమేరంగి తదితర చోట్ల కూడా ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేశారు.

పరీక్ష గదిలోనే ల్యాబ్ సామగ్రి

భామిని: భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. ఈ కేంద్రంలో ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా, డాక్టర్ అంబేడ్కర్ గురుకులంతో పాటు జూనియర్ కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అయితే భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన గదులు లేవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాలేజీలో ఉన్న పెద్ద మూడు హాళ్లను పరీక్షలకు కేటాయించారు. ఒక్కో హాల్‌కు రెండు గదులుగా విభజించారు. 50 మంది విద్యార్థులకు ఒక్కో గదిలో కూర్చొనేలా ఏర్పాట్లు చేశారు. కాగా పరీక్ష గదిలో కాగితపు ముక్క కూడా ఉండకూడదని ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ.. అదేదీ ఇక్కడ అమలు కావడం లేదు. ల్యాబ్‌కు సంబంధించి సామగ్రి, బీరువా, పుస్తకాలు, ఇతరత్రా సామగ్రి ఒక గదిలోనే ఉంచారు. మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. కళాశాల ఎంట్రన్స్‌లో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఎందుకీ నిర్లక్ష్యం?

● మా సమస్యలు పట్టవా.. ● గళమెత్తిన ఉద్యోగ, ఉపాధ్యాయులు
● సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు ● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

పార్వతీపురం రూరల్/పాలకొండ/సాలూరు రూరల్, ఫిబ్రవరి 29: జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన గళమెత్తారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పట్టవా? అంటూ ప్రశ్నించారు. గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వారు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ మాట్లాడుతూ.. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ప్రభు త్వం వేరే అవసరాల కోసం దారి మళ్లించడం దారుణమన్నారు. అధికా రంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ నేడు మాట తప్పి.. మడం తిప్పారని అన్నారు. ఐఆర్ 30 శాతం అమలు చేయాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని, డీఏలు విడు దల చేయాలని, పెన్షనర్స్‌కు అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ మంజూరు చేయాలని, ఉపాధ్యాయ నియామకాల్లో ప్రవేశపెట్టిన అప్రంటీస్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం డీటీ వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు.



సాలూరులో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

● **పాలకొండ:** నగరపంచాయతీలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డీటీ బుచ్చియ్యకు వినతిపత్రం ఇచ్చారు. 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి 30 శాతం, 11వ పీఆర్‌సీ బకాయిలు ఏక మొత్తంలో చెల్లించాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, కౌన్సిలర్ నాగరాజు, గౌరవాధ్యక్షుడు టి.ఉమామహేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

● **సాలూరు రూరల్:** సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూడా ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని ఏపీజేఏసీ నాయకులు వాయిదా వేయడం సబబు కాదన్నారు. ఇందుకు నిరసనగా ఏపీటీఎఫ్ నాయకత్వం ధర్నాలకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక బకాయిల న్నింటినీ తక్షణమే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సాలూరు, పాచిపెంట శాఖల నాయకులు పాల్గొన్నారు.





పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం, పాలకొండలో డీటీకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

'ఏకలవ్య'లో ప్రవేశానికి దరఖాస్తులు

పార్వతీపురం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనసభద్ర, కోటికిపెంట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏపీటీడబ్ల్యూజీయూఆర్‌యూకేయూఎల్‌ఎం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 2023-24లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. పి.కోనవలస, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, సీతంపేట గురుకులాల్లో ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై దృష్టి

● ఆర్డీవో సూర్యకళ


జంతు సంక్షేమంపై కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో

కలెక్టరేట్: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సూర్యకళ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆర్ డీవో కార్యాలయంలో జంతు సంక్షేమ కమిటీ డివిజన్ స్థాయి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి ఎంపీడీవోలు, తహసీల్దారుల ఆధ్వర్యంలో కమిటీలను పటిష్టపరిచి పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అనంతరం గోమాత చిత్రపటంతో కూడిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ, పశు సంవర్ధక శాఖ డి.డి. వైవీ రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

కొత్తవలస: కొత్తవలస కుమ్మరబంజరులోని గరుడాద్రి కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు బోని వెంకటఅప్పారావు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఐవీ సతీష్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. విన్నకోటమల్లికార్జున స్వామి, నీరజ దంపతులు రూ.1.50 లక్షలతో తయారు చేసిన 108 సాలగ్రామాలు పొదిగిన వెండి మాలను సమర్పించారు. కొత్తవలసకు చెందిన జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గవర సూరిబాబు రూ.1.20లక్షలు వెచ్చించి 60 కిలోల ఇత్తడితో చేయించిన మకర తోరణాన్ని అందజేశారు. శుక్రవారం భారీ అన్న సమారాధన చేస్తున్నట్టు వెంకట అప్పారావు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేగిడి: ఉంగరాడమెట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి బూరాడ ఫీడర్‌లో తొమ్మిది గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ హరి తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా కాగితాపల్లి, ఉణుకూరు, అంబాడ, వెంకటాపురం, పోరాం, పనసలవలస, కొర్లవలస, ఒప్పంగి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మెస్ బిల్లులను విడుదల చేయండి

విజయనగరం రింగురోడ్డు: గిరిజన వసతి గృహాలకు మెస్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘ అధ్యక్షుడు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. గురువారం గిరిజన వసతి గృహంలో ఆయన మాట్లాడుతూ... ఆరు నెలలుగా మెస్ బిల్లులు నిలిచిపోయాయన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినిధులు ఎం.శివ, ఆర్.నాయుడు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

శృంగవరపుకోట/జామి: లీఫ్ సంవత్సరం సందర్భంగా ఎస్.కోట, జామి మండ లాల్లో ఉన్న వాసవీ వనిత క్లబ్‌లు గురువారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిం చాయి. పేదలకు రెండు కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశాయి.

రేపు బహిరంగ వేలం

రాజాం: రాజాం పురపాలక సంఘ పరిధిలోని రోజువారీ మార్కెట్, కబేళాలకు సంబంధించిన ఆశీలు వసూలుకు శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్టు కమిషనర్ నారా అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

22,100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస: ముసిరాం, కొత్తభూమి ప్రాంతాలలో నాటు సారా స్థావరాలపై గురువారం దాడులు చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ ఇందిరాదేవి తెలిపారు. ఈ దాడులలో 22,100 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు వెల్లడించారు. ఈ దాడులలో విజయనగరానికి చెందిన డీటీఎఫ్, ఎస్‌ఈబీ సిబ్బంది, చోడవరం డీటీఎఫ్ అనకాపల్లి ఇంటిలిజెన్స్ బృందం పాల్గొన్నారని తెలిపారు. దాడులలో సీఐ రాజేశ్వరి, ఎస్‌ఐలు రాజేష్, రామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగపురంలో...

మండలంలోని రామలింగపురం గ్రామంలో నాటు సారా స్థావరాలపై గురువారం దాడు లు నిర్వహించినట్టు కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడులలో 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు వెల్లడించారు.

రామభద్రపురం మండలంలో..

రామభద్రపురం: చందాపురం గ్రామ సమీపంలో గురువారం 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. నాటుసారా తయారు చేయడానికి డబ్బాల్లో ఈ ఊటలు సిద్ధం చేస్తుండగా ధ్వంసం చేసినట్టు తెలిపారు. నాటుసారా అమ్మకాలు, మద్యం బెల్టుషాపులు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెచ్‌సీ రమణ, పోలీసు కానిస్టేబుల్ నారాయణరావు, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం/నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం మొయిద జంక్షన్‌లో గురువారం అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని... అతని నుంచి 90 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ లలిత తెలిపారు. పతివాడ వెంకట మురళి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నెల్లిమర్ల సబ్ స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నెల్లిమర్ల ఎస్‌ఐ టీవీ కుమార్ తెలిపారు. ఈ దాడిలో పీసీలు బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

'ఓపీఎస్ సాధన' పుస్తకావిష్కరణ

బొబ్బిలి: యూటీఎఫ్ ఆధ్వర్యంలో 'ఓపీఎస్ సాధన' అనే పుస్తకాన్ని గురువారం సాయంత్రం యూనియన్ నాయకులు బొబ్బిలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేత కె.విజయగౌరి మాట్లాడుతూ రాజకీయ నేతల భవిష్యత్తును నిర్ణయించేది మన ఓటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, సత్యనారాయణ, రాధాకృష్ణ, కె.కృష్ణదాసు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: బొబ్బిలి నూతన తహసీల్దార్‌గా త్రినాథరావునాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన డోల రాజేశ్వరరావును అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి కిరణ్‌కుమార్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఎన్నికల నియమావళి ప్రకారం కిరణ్‌కుమార్‌ను ఎస్.కోటకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మెంటాడ తహశీల్దారు త్రినాథనాయుడును నియమించారు. తహశీల్దారుకు డీటీలు సాయికృష్ణ, శ్రీనివాస్, ఆర్‌ఐ కళ్యాణచక్రవర్తి, వీఆర్‌ఓలు స్వాగతం పలికారు.

అవ్వకు ఆపన్న హస్తం


వృద్ధురాలికి చికిత్స అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పొట్ట కూటి కోసం ఊరూరా తిరిగి నెమలి పింఛాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలు ప్రమాదంలో గాయపడింది. ఆమెను పలువురు మానవతావాదులు ఆదుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పురూలియాకు చెందిన ఫుల్కోదేవి అనే వృద్ధురాలు స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో తల దాచుకుంటోంది. నెమలి పింఛాలు అమ్ముకునేందుకు రోడ్డుపైకి వెళ్లిన ఆమెను గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైంది. కింతలివానిపేట గ్రామానికి చెందిన కిశోర్ ఆమెను హెడ్ కానిస్టేబుల్ మహదేవ శ్రీనివాసరావు సహకారంతో స్థానిక సీహెచ్‌సీలో చేర్పించి చికిత్స చేయించారు. రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స చేయిస్తామన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ కూడా తన వంతు సాయం అందజేశారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

● విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 5, 7 డివిజన్ల పరిధిలో వివిధ పార్టీల వారు టీడీపీలో చేరారు. వారికి అదితి పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పాలన సాగిందన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందని విమర్శించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడాలంటే.. అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, విజయనగరం అర్బన్ అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్, ఐదో డివిజన్ ఇన్‌ఛార్జి నాగరాజు, నాయకులు ఐవీపీ రాజు, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గదుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఖాళీ అవుతుంటే భయం..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): 'రాక్షస పాలనతో విసిగిపోయి..అమ్మలాంటి టీడీపీలోకి చేరుతున్న వారిపై విజయనగరానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటు. టీడీపీ కార్యకర్తలను బెదిరిస్తు న్నారంటే వైసీపీ ఖాళీ అవుతుంటే నాయకులు భయపడినట్లే'నని విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు వ్యాఖ్యానించారు. విజయనగరం మండలం రీమాపేట పంచాయతీ అంబటివలసకు చెందిన సుమారు 120 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. చిల్ల సత్యనారాయణ, తాడ్డి నారాయణప్పడు, సనాపతి పైడప్పనాయుడు, రేవల్లె సత్యనారాయణ, తాడ్డి అప్పలనాయుడు, రేగాన ప్రకాష్‌రావు, చిల్లా వెంకట లక్ష్మి, తాడ్డి అచ్చియ్యమ్మ తదితరులకు కండువాలు వేసి అదితి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదోడి భూమిపై వైసీపీ పెద్దల కన్ను పడుతోందని... ఇలాంటి కష్టాలు, నష్టాలు భరించలేక తెలుగుదేశం పార్టీలో చేరుతుంటే వైసీపీ నేతలకు భయం పట్టుకుందని విమర్శించారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈగల సత్తిబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సూపర్ సిక్స్ కార్యక్రమాలపై గురువారం రాత్రి పడాలపేట పంచాయతీలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన కార్యకర్తలు, నేతలతో అదితి గజపతిరాజు

గిరిజనుల వైద్యానికి ప్రత్యేక ఏర్పాట్లు

● ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

విజయనగరం రింగురోడ్డు: వైద్యం కోసం గిరిజనులు చేరిన వెంటనే వారికి సత్వరం మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు చెప్పారు. సాలూరు మండలం విజయరామపురం వద్ద ఇటీవల పెళ్లి వ్యాను బోల్తాపడిన సంఘటనలో గాయపడి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 9 మంది గిరిజనులను గురువారం ఆయన పరామర్శించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి ప్రమాద బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులు అందరికీ మెరుగైన వైద్యం అందుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సురేష్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

విజయనగరం రింగురోడ్డు: జిల్లాలో ఈ నెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు కోరారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పల్స్ పోలియోకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0 నుంచి 5 ఏళ్ల పిల్లలకు చుక్కల మందు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డెమో వి.చినతల్లి, మలేరియా అధికారి వై.మణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి..

కొత్తవలస: పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

టెక్నికల్ సింపోజియంతో సత్ఫలితాలు

● జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం రూరల్: ఇంజనీరింగ్ విభాగంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో కళాశాలల్లో ఎప్పటికప్పుడు జాతీయ స్థాయిలో జరుగుతున్న టెక్నికల్ సింపోజియం వల్ల ఎన్నో సత్ఫలితాలు లభిస్తాయని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ చెప్పారు. గత రెండు రోజులుగా కళాశాలలో జరుగుతున్న ఈ సింపోజియం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... ఈ సింపోజియంలో సీనియర్ అధ్యాపకులు, వివిధ రంగాల నిపుణులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.నళిని, నిర్వాహకులు అప్పలనాయుడు, హేమ, సీహెచ్ కాశీవిశ్వనాథం, ఎస్‌కె మోహిద్దీన్, ఆర్.లిపిక చౌదరి, పి.లిఖిత శ్రీ తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ జయసుమకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘ ప్రతినిధులు

రెండు ఎంపీ సీట్లు కేటాయించండి

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల పరిధిలో రెండు ఎంపీ, ఐదు ఎమ్మెల్యే సీట్లను అర్హతలు, ఉత్సాహం ఉన్న యాదవులకు కేటాయించాలని ఉత్తరాంధ్ర యాదవ సంఘం కోరింది. గురువారం విశాఖపట్టణంలో జరిగిన సమావేశంలో శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి పలువురు ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉత్తరాంధ్ర యాదవ సంఘం నాయకులు నర్సు రామారావు, గొలగాని హరికుమారి, ఓమ్మి సన్యాసిరావు, గొంపా అప్పారావు, ముచ్చి రామలింగస్వామి తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా నుంచి ముచ్చి రామలింగస్వామి, మురపాల బాలాజీ, కోడెల ముత్యాలనాయుడు తదితరులు హాజరయ్యారు.

బీటీ రహదారికి శంకుస్థాపన

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని 39వ డివిజన్ అలకనంద కాలనీలో నూతనంగా నిర్మించనున్న బీటీ రహదారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధే లక్ష్యంగా అనేక పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం రూ.15 లక్షలతో బీటీ రహదారిని, కల్వర్టును నిర్మిస్తున్నట్టు తెలిపారు. మేయర్ వి.విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జి తమన్నశెట్టి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కార్పొరేటర్ పిన్నింటి కళావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

● ఏపీటీఎఫ్ డిమాండ్


బొబ్బిలి: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

బొబ్బిలి: ఉపాధ్యాయ, ఉద్యోగ, పింఛనుదారులకు సంబంధించిన అనేక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహ సీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘ నేత రౌతు రామమూర్తితో పాటు ఏపీటీఎఫ్ నాయకులు జేసీ రాజు, బంకురు జోగినాయుడు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. పింఛనుదారులకు మరీ అన్యాయం చేసిందన్నారు. పాత బకాయిలన్నిటినీ విడుదల చేయాలని, ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమ కార్యకర్తలపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఓటు ద్వారా ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ బొత్స పద్మావతి, నాగేశ్వరరావు, పీటర్, ఎల్లయ్య, లక్ష్మణరావు, శ్రీను, చిన్నారావు, మోహనరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

రాజాం: ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా... తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీటీఎఫ్ జోనల్ కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షుడు మురపాక వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఆసక్తి కనబరచడం లేదన్నారు. 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతిని తక్షణమే చెల్లించాలని... 11వ పీఆర్‌సీ బకాయిలు ఒకేసారి చెల్లించాలని కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశా రు. ఈ కార్యక్రమంలో లెంక రామకృష్ణ, యలకల భాస్కరరావు, నల్ల రవికుమార్, ఎందువ సీతంనాయుడు, పిల్లా తిరుపతిరావు, ఎందువ రామకృష్ణ, కుమరాపు చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పదును పెట్టాలి


పుర్లిలో పిల్లల విద్యా సామర్థ్యాలపై ఆరా తీస్తున్న ఎంఈవో

రేగిడి: విద్యార్థుల లోని సృజనాత్మకతకు పదును పెట్టాలని ఎంఈఓ వరప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. పుర్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యా ప్రమాణాలు, తరగతి గదుల నిర్వహణ, బోధన సామర్థ్యాలపై హెచ్‌ఎం గణేశ్వరరావుతో సమీక్షించారు. ఆయన వెంట సీఆర్‌పీ వెంకటరమణ, ఉపాధ్యాయుడు గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.


భువనేశ్వరితో లలిత కుమారి

నారా భువనేశ్వరిని కలిసిన లలితకుమారి

శృంగవరపుకోట: నర్సీపట్నంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వచ్చారు. ఆమెను ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మర్యాదపూర్వకంగా కలిశారు.

గురానతో యువజన సంఘ నాయకుల భేటీ


గురాన అయ్యలుకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న మురళి

విజయనగరం దాసన్నపేట: జనసేన నాయకుడు గురాన అయ్యలును తన కార్యాలయంలో లంకాపట్టణం అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు మురళీమోహన్ తదితరులు గురువారం మర్యాదపూర్వ కంగా కలిశారు. అయ్యలు ను సత్కరించారు.

కిషోర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

రాజాం: ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వీఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన చింత కిషోర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ హామీ ఇచ్చారు. గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ సర్పంచ్ చింత శ్రీరాములును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, టంకాల నాగరాజు పాల్గొన్నారు అనంతరం కోండ్రు పత్రికా ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.


చింత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోండ్రు మురళీమోహన్

రహదారిపై నడిచేదెలా?

రేగిడి: పాలకొండ- రాజాం ప్రధాన రహదారిపై సంకిలి వద్ద కొంతమంది మురుగు నీరు, కొళాయి నీటిని రోడ్డు మీదకు విడిచి పెడుతున్నారు. దీని వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందని సర్పంచ్ పట్టాభి, కార్యదర్శి శివకు నివేదించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శివ స్పందిస్తూ... సమస్య తమ దృష్టికి వచ్చిందని, మురుగు కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సంకిలి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మహా శివరాత్రికి పక్కా ఏర్పాట్లు

● ఆర్డీవో సూర్యకళ

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మార్చి 8వ తేదీన జరుగనున్న మహాశివరాత్రి జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో సూర్యకళ సూచించారు. జాతరకు సంబంధించి రామతీర్థంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ భక్తులు ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దేవదాయశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. భక్తులకు తాగునీరు, ఉచిత మజ్జిగ, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, దేవదాయశాఖ రాజమండ్రి ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయరాజు, జిల్లా ఏసీ అన్నపూర్ణ, జడ్పీటీసీ సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీఈవో ప్రేమ్‌కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నెల్లిమర్ల: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు భయం, ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ఉమ పాల్గొన్నారు.

279 జీవో ప్రకారం జీతాలు ఇవ్వండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం పురపాలక సంఘ ప్రజారోగ్య విభాగం లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 15 సంవత్సరాలుగా డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు 279 జీవో ప్రకారంగా జీతాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, మున్సిపల్ డ్రైవర్లు పి.గాంధీ, బి.సంతోష్ కుమార్, కె.వెంకటరావు, పి.వరదరాజు, ఎస్.శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు సీఐటీయూ, మున్సిపల్ డ్రైవర్లు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పురపాలక సంఘంలో డ్రైవర్లుగా చేరినప్పటి నుంచి 2018 జూన్ నెల వరకు మాత్రమే తమ నైపుణ్యానికి తగ్గట్టు జీతాలు చెల్లించేవారని, ఆప్కాస్ 279 జీవో అమలు ద్వారా తమకు ఎటువంటి జీతాలు పెంపుదల లేదన్నారు. గత 15 ఏళ్లగా పురపాలకసంఘం ప్రజారోగ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్‌గా పని చేస్తున్న తమను ఆప్కాస్‌లో డ్రైవర్లుగా నమోదు చేసి, తమ నైపుణ్యానికి తగిన జీతాలను పెంచాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఆర్టీసీ సిబ్బందికి లామినేటెడ్ గుర్తింపునకు అంగీకారం


మాట్లాడుతున్న దామోధరరావు

పాలకొండ: ఆర్టీసీ సిబ్బందికి లామినేటెడ్ గుర్తింపునకు, ఆర్‌ఈఎంఎస్ స్కీం వర్తింపజేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షు డు కలిశెట్టి దామోదరరావు తెలిపారు. గురువారం పాల కొండలో సాయి కల్యాణ మండపంలో పాలకొండ డిపో ఈయూ నాయకులు బీజీ రావు, కేకే రావు, ఎం.లింగమూర్తికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపో కమిటీ ఆధ్వర్యంలో ఈయూ అధ్యక్షుడు సాగర్, కార్యదర్శి ఎల్.డినాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దామోదరరావు పాల్గొని, మాట్లాడా రు. ఓటి అలవెన్స్‌లు జీతంతో చెల్లింపులు జరిగేలా ఈయూ రాష్ట్ర కమిటీ కృషి మేరకు ప్రభుత్వం చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో వెంకటేశ్వరరావు, ఈ కార్యక్రమంలో ఈయూ మన్యం జిల్లా కార్యదర్శి సుందరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుమ్మెద దుర్గారావు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై స్పందించండి

● నినదించిన గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు



నిరసన తెలుపుతున్న గిరిజన విద్యార్థులు

బెలగాం: ఐటీడీఏ పరిధిలోని విద్యా సంస్థల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల మరణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రంజిత్ కుమార్, సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గిరిజన విద్యార్థులతో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారం రోజుల వ్యవధిలో నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందినా అధికారులు నివారణ చర్యలు చేపట్టలేదన్నారు. తక్షణమే మరణాల కట్టడికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలో ఆరోగ్య సిబ్బందిని నియమించాలని కోరారు. బాధిత కటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, డైట్ చార్జీలను పెంచి పౌష్టి కాహారం అందించాలని, సురక్షిత నీరు, దోమ తెరలు వంటి మౌలిక సదు పాయాలు కల్పించాలని కోరారు.

జాబ్ మేళాలో 337 మందికి ఉద్యోగ అవకాశాలు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 337 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఈ మేళాకు 840 మంది హాజరు కాగా, వీరిలో 337 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి లభించింది. 14 బహుళ జాతి కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాకు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ, స్కిల్ డివెలప్‌మెంట్ అధికారి ఎస్.గోవిందరావు, ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లెండిలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటర్‌షిప్

డెంకాడ: లెండి కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించనున్న అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటర్‌షిప్ ప్రోగ్రాంను జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ జయసుమ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ కేవీ నరసింహం, అన్ని విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఘనంగా రాజబంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవం

నెల్లిమర్ల: జరజాపుపేట ముఖద్వారం వద్ద గ్రామ దేవత రాజబంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు, టీడీపీ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, సువ్వాడ రవిశేఖర్, లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

జీవనోపాధి మెరుగు పడాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

గంట్యాడ: మహిళా సంఘాల జీవనోపాధి మెరుగుపడే విధంగా పని చేయాలని ఏపీ ఎంఎఎస్ బృంద సభ్యుడు సిద్ధ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏపీ ఎంఎఎస్ బృందం గురువారం కొటారుబిల్లి గ్రామైక్య సంఘాన్ని పరిశీలించింది. మహిళా సంఘాలు తీసుకున్న రుణ వసూళ్ల శతశాతం చేయాలని సూచించింది. ఈ సమావేశంలో టీం సభ్యులు దేవస్ కుమార్, ఏపీడీ సావిత్రి, ఏజీఎం ఉమామహేశ్వరరావు, డీపీఎం జయశ్రీ, ఏసీ ఆదయ్య, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● టీడీపీ గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్

గజపతినగరం: టీడీపీ గెలుపే లక్ష్యంగా గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఓ ప్రైవేటు భవనంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలన అవినీతి, అక్రమాలు, కక్ష దోరణిగా సాగుతుందని, ఈ సైకో జగన్‌ను వదిలించుకోవాలంటే బాబు పాలన రావాలన్నారు. తనను ఆధరించి గెలిపించినట్లయితే నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, నాయకులు చప్పా చంద్రశేఖర్, బొడ్డు రాము, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న భరత్‌కుమార్

టీడీపీలో చేరికలు

గుమ్మలక్ష్మీపురం: కేదారిపురం పంచాయతీలో శంఖారావం సూపర్‌సిక్స్‌లో భాగంగా కురుపాం నియోజకవర్గం టీడీపీ, జనసేన అభ్యర్థి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పది కుటుంబాలు గురువారం చేరాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాడి సుదర్శనరావు, పోలూరు శ్రీనివాసరావు, కద్రక వెంకటరావు, భుజ్జేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం: మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

సూపర్ సిక్స్‌పై ఇంటింటి ప్రచారం

గరుగుబిల్లి: రావివలస గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు, అరకు పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కోట భరత్‌కుమార్ గురువారం పర్యటించి, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు ఎ.గంగాధర్‌నాయుడు, గంట సీతారానాయుడు, గుంట్రెడ్డి వెంకటనాయుడు, జి.భానుమూర్తి, గొర్లి కిషోర్, జి.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల షెడ్డుకు నిధులా?

● మా సమస్యలు పట్టవా?
● అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
● రసాభాసగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సాలూరు: 'మా వార్డుల్లో సమస్యల పరిష్కారానికి డబ్బులు అడిగితే నిధులు లేవని చేతులెత్తేస్తున్నారు. కానీ, మున్సిపాల్టీకి చెందిన వాహనాలను భద్రపరిచేందుకు మాత్రం నిధులు కేటాయిస్తామంటున్నారు. మేమంటే అంత చులకనా?. మా సమస్యలు మీకు పట్టవా?. అని మున్సిపల్ అధికారులను పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. దీంతో సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలోని అంశాలను అధికారులు చదివి వినిపించారు. పట్టణంలో నీటి సరఫరా బావుల్లో ఉన్న షిల్ట్‌ను తీసేందుకు రూ.2,95,680 వినియోగించేందుకు కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. మున్సిపాల్టీలో ఇంటింటికి చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న వాహనాలు ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన జేసీబీ, కాంపేక్టర్, తాగునీటికి ఉపయోగిస్తున్న ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ ఆరుబయట ఉండటంతో ఎండకు ఎండి వానకు తడిచి తొందరగా పాడైపోతున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వారి కార్యాలయం ఎదురుగా ఉన్న రేకుల షెడ్డును తీసి కొత్తగా షెడ్డును నిర్మించేందుకు రూ.11లక్షల 50 వేల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చారు. వాహనాలు ఉంచేందుకు అంత డబ్బులు ఖర్చు చేయటం అవసరమా.. అని కౌన్సిలర్ గిరి రఘు అధికారులను ప్రశ్నించారు. 'మా 11వ వార్డు చిన హరిజనపేటలలో ఎన్నో సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతునే ఉన్నారు. గడప గడప కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ముందే ఎన్నో సమస్యలపై నన్ను నిలదీస్తున్నారు. మా వార్డు సమస్యలు పరిష్కరించేందుకు కనీసం రూ.50వేలు మంజూరు చేయండని ఎన్ని సార్లు అడిగినా సాధారణ నిధుల్లో డబ్బులు లేవని చెబుతునే ఉన్నారు. అలాంటిది వాహనాలు భద్రపరిచేందుకు లక్షల రూపాయలు ఎలా వచ్చాయి. దళిత వాడలంటే అంత చులకనా..' అని కౌన్సిలర్ లింగాల దుర్గ ప్రశ్నించారు. 25వ వార్డు ప్రజలు నీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతుంటే ఈ విషయాన్ని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సమస్య పరిష్కరించటం లేదని కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ వార్డు సమస్యల పరిష్కారానికి లక్ష రూపాయలైనా మంజూరు చేయాలని కోరారు. దీంతో షెడ్ నిర్మాణం అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి తెలిపారు. ఇంటి పన్ను వసూలు చేసేందుకు వెళ్తే.. ప్రజలు ఎవ్వరూ పన్నులు కట్టవద్దని 25వ వార్డు కౌన్సిలర్ ఈశ్వరరావు ప్రజలకు చెప్పారని, అందుకే ప్రజలు పన్నులు కట్టడం లేదని ఆర్ఐ శ్రీనివాసరావు చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె.. ఇది సరైన పద్ధతి కాదని కౌన్సిలర్‌ను నిలదీశారు. గతేడాది తమ వార్డులో రూ.6లక్షలు పన్నుల రూపంలో ప్రజలు చెల్లించారని, కానీ ఏం అభివృద్ధి జరగలేదని, అందుకే కట్టవద్దని చెప్పానని అన్నారు.

మున్సిపాల్టీలో పనిచేస్తున్న వాహనాల డ్రైవర్లు విధులకు డుమ్మా కొట్టి నిత్యం షికార్లు చేస్తున్నారని కౌన్సిలర్ గిరి రఘు ఆరోపించారు. షాపింగ్ కాంపెక్స్‌లో 12 షాపులు ఖాళీగా ఉన్నాయని వాటిని తక్షణం అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ బలభద్రుని శ్రీనివాసరావు కోరారు. 1వ వార్డులో ప్రజలు నిత్యం దోమలతో నానా ఇబ్బందులు పడుతున్నారని దోమలను నివారించాలని కౌన్సిలర్ వరలక్ష్మి అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు అప్పలనాయుడు, దీప్తితో పాటు పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

1214 మెమోను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

పాలకొండ: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు తమ సంక్షేమ పథకాల బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేసిన 1214 మెమోను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం పాలకొండ మండల ప్రధాన కార్యదర్శి ఆర్తమూడి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో పాలకొండ డివిజన్ కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆరోపించారు. పథకాలు అందకుండా 1214 మెమోతో అడ్డుకుంటున్నారని చెప్పారు. ఈ నిరసనలో మల్లవరపు రమేష్, గార అప్పన్న, శేఖర్, నారాయణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయొద్దు



ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతానగరం: ప్రాథమిక విద్యావ్యవస్థలో చిన్నారులు ఒకటో తరగతిలో చేరాలంటే ఆరేళ్ల వయసు ఉండాలని కేంద్రం తీసుకువచ్చిన నిబంధనతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతాయని, ఈ నిబంధనను వెంటనే సవరించాలని యూటీఎఫ్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిబంధనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిబంధనతో ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూతపడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, గౌరవాధ్యక్షుడు టి.మధుసూధనరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.ఆదినారాయణ, కె.మురళి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పింఛన్లు పంపిణీ చేయాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలోని 13 సచివాలయాల్లో 8,461 మంది పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము మంజూరయ్యిందని తెలిపారు. సంబంధిత సచివాలయాలకు చెందిన మొత్తాలు ఆయా బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని, గ్రామస్థాయిలో వలంటీర్లతో పంపిణీ చేయాలని సూచించారు.

ఇంటిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

సీతంపేట: ఇంటి పన్ను వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ ఆదేశించారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం సమావేశం మందిరంలో సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు అవసరమైన మౌలిక సౌకర్యాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, ఈవోపీఆర్‌డీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

వీరఘట్టం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం సిబ్బందికి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో సమయపాలన పాటించాలని కోరారు. ఆరోగ్యశ్రీ కార్డులు అందలేదన్న ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర సమన్వయకర్త అమ్మినాయుడు

గరుగుబిల్లి: దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త ఎస్.అమ్మినాయుడు సూచించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిర్వహించి, దివ్యాంగులను గుర్తించి, సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచాలన్నారు. దివ్యాంగులకు వైద్య సేవలతో పాటు ఫిజియోథెరిపీ సేవలను సక్రమంగా అందించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సేవలు అందించడంలో విఫలమైతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ పరిశీలనలో జిల్లా సహిత సమన్వయకర్త పి.భానుమూర్తి, ఎంఈవో కె.కొండలరావు, సిబ్బంది వీర్రాజు, తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

సీతంపేట: జిల్లా శిక్షణ కలెక్టర్‌గా నియమితులైన రాఘవేంద్ర మీన గురువారం సీతంపేట ఐటీడీఏలో పర్యటించారు. కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్ ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, డీడీ అన్నాదొర, డిప్యూటీ డీఈవో లిల్లీరాణి, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఏఎంవో కోటిబాబు పాల్గొన్నారు.

ఉపాధి ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పనులు చేపడుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉందని మండల ఉపాధి హామీ పథకం జేఈ డి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతోషపురం, పిట్టలమెట్ట పంచాయతీల్లో జరుగుతున్న సాగునీటి చెరువు అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పనుల్లో పాల్గొన్న వేతనదారులకు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ప్రారంభమైనందున పనులు జరిగే ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు టెంట్లును ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు జి.వెంకటనాయుడు ఉన్నారు.

ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్మాణాన్ని వేగవంతం చేయాలి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీవో విష్ణుచరణ్

సాలూరు: పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో చేపడుతున్న ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ అధికారులకు ఆదేశించారు. అతిథి గృహం నిర్మాణం పనులను ఆయన గురువారం పరిశీలించారు. పది రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి, నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

గరుగుబిల్లి: ఈనెల 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కేకే సాగర్‌వర్మ, సంతోషకుమార్ మాట్లాడుతూ లక్ష్యానికి మించి పల్స్ పోలియో చుక్కలను వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో వైద్య సిబ్బంది సీహెచ్ ఉదయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: పాలకొండ విద్యుత్ ఉపకేంద్రం నిర్వహణ పనుల నిమిత్తం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలకొండ టౌన్, తంపటాపల్లి, మంగళాపురం, వెలగవాడ, లుంబూరు, నవగాం, పొట్లి, అవలంగి, ఎం.సింగుపురం, డోలమడ, జంపరకోట, బొడ్డుమాసంగి, మల్లివీడు, పనుకు వలస, బజ్జి, అట్టలి, వాటపాగు, తుమరాడ, టికెరాజపురం, చింతాడ, తెట్టంగి, నీలానగరం, ఎం.వెంకటాపురం, తలవరం, పనసందివాడ, వండువ, బిటివాడ, బొడ్లపాడు, అడారు, పాపంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. **భామిని:** మండలంలో 33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు చేపట్టేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు.

492 మందికి ఇళ్ల పట్టాలు

సాలూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర గురువారం 492 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇళ్ల పట్టాలతో పాటు వ్యవసాయ భూమి మంజూరు పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి, కొల్లిపల్లి త్రినాథనాయుడు, రెడ్డి సురేష్, దండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

సాలూరు: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను డిప్యూటీ సీఎం రాజన్నదొర గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో ఇది 12వ మార్ట్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ విజయలక్ష్మి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

పాలకొండ: భూ హక్కుల చట్టం 27/23 వ్యవసాయ భూములు, స్థిరాస్తులు దాని ప్రభావంపై శుక్రవారం నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. పాలకొండ పట్టణంలోని అయ్యప్పశంకర్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వక్తలుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీనియర్ న్యాయ నిపుణులు పాల్గొంటారని చెప్పారు. అంతకుముందు జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఘనంగా లక్ష్మీనరసింహ విగ్రహ ప్రతిష్ఠ

ఒడిశా

రాయగడ: జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో అమలాపేట గ్రామంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ భక్తుల జయ జయధ్వానాల మధ్య గురువారం ఉదయం ఘనంగా జరిగింది. బాలాజీ మందిర్ ప్రధానార్చకులు భాస్కరాచార్యుల విప్రబృందం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత యజ్ఞహోమాది క్రతువులు, పంచామృత స్నానాలు కలశ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జిల్లాలో ప్రప్రథమంగా నిర్మించిన ఈ లక్ష్మీనరసింహ ఆలయ ప్రదేశం మున్ముందు ఓ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా మారబోతుందని భక్తులు భావిస్తున్నారు. స్వామివారి పూజా కార్యక్రమంలో బిజూ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పూర్వ రాజ్యసభ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి మరింతగా కృషిచేస్తామని ఆలయ నిర్మాణ యజమాని ట్రస్టీ డి.శ్రీనివాసరావు దంపతులు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.


భక్తులకు దర్శనమిస్తున్న నరసింహస్వామి

